పంతం నెగ్గించుకున్న బెంగాల్ స్పీకర్

- ఇద్దరు ఎమ్మెల్యేలతో స్పీకర్ ప్రమాణ స్వీకారం
- రాజ్యాంగ ఉల్లంఘనే
- రాష్ట్రపతికి గవర్నర్ లేఖ

విజయ సంకేతం చూపిస్తున్న ఇద్దరు ఎమ్మెల్యేలు

కోల్‌కతా: ఇద్దరు ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం విషయంలో బెంగాల్ స్పీకర్ తన పంతాన్ని నెగ్గించుకున్నారు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో గెల్చిన అధికార టీఎంసీ ఎమ్మెల్యేలతో అసెంబ్లీ స్పీకర్ బిమన్ బెనర్జీ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయించారు. ఇందు కోసం సభను ఒకరోజు ప్రత్యేకంగా నిర్వహించారు. ప్రమాణస్వీకారం అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు. అయితే ఇలా ప్రమాణ స్వీకారం చేయించడం రాజ్యాంగ ఉల్లంఘనేనని గవర్నర్ సీవీ ఆనంద్ బోస్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు శుక్రవారం లేఖ రాశారు. స్పీకర్ తీరును ఆయన తప్పు బట్టారు.

వివాదం ఏంటి?

భగవాంగొల ఎమ్మెల్యే రాయత్ హొస్సేన్ సర్కార్, బారానగర్ ఎమ్మెల్యే సయాంతికా బెనర్జీలతో ఎవరు ప్రమాణస్వీకారం చేయించాలి, ఎక్కడ చేయించాలన్న దానిపై రాజ్‌భవన్, అసెంబ్లీ మధ్య వివాదం నెలకొన్నది. ఎమ్మెల్యేలు రాజ్‌భవన్‌లో ప్రమాణస్వీకారం చేయాలని గవర్నర్ ఆదేశించగా, అందుకు వారు నిరాకరించారు. గవర్నర్ తీరుకు వ్యతిరేకంగా వారు ఆందోళన చేపట్టారు. సంప్రదాయాన్ని అనుసరించి తాము శాసనసభలోనే ప్రమాణం చేస్తామని స్పష్టంచేశారు. ఈ క్రమంలో అనూహ్యంగా తన వైఖరిని మార్చుకున్న గవర్నర్.. వారితో ప్రమాణం చేయించే బాధ్యతను డిప్యూటీ స్పీకర్‌కు అప్పగించారు. అయితే సభ ప్రారంభమైన తర్వాత డిప్యూటీ స్పీకర్ ఆ బాధ్యత నుంచి తప్పుకున్నారు. స్పీకర్ సభలో ఉన్న సమయంలో వారితో తాను ప్రమాణం చేయించడం నిబంధనలకు విరుద్ధమన్నారు.

యూకే కొత్త ప్రధాని స్టార్మర్

- సార్వత్రిక ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘన విజయం
- 650 నియోజకవర్గాలకు 412 స్థానాల్లో గెలుపు
- సునాక్ నేతృత్వంలోని కన్జర్వేటివ్ పార్టీకి భంగపాటు
- క్షమాపణలు చెబుతున్నా.. ఓటమికి నాదే బాధ్యత
- పరాజయం అనంతరం రిషి సునాక్ భావోద్వేగం
- దేశాన్ని పునర్నిర్మిస్తా.. ప్రజలకు కీర్ స్టార్మర్ హామీ

ఎన్నికల్లో గెలిచిన అనంతరం భార్య విక్టోరియాతో కలిసి 10, డౌనింగ్ స్ట్రీట్‌కు వస్తున్న యూకే కొత్త ప్రధాని కీర్ స్టార్మర్

లండన్, జూలై 5: యూకే నూతన ప్రధానిగా కీర్ స్టార్మర్ నియమితులయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో స్టార్మర్ నేతృత్వంలోని లేబర్ పార్టీ ఘన విజయం సాధించింది. భారత సంతతికి చెందిన రిషి సునాక్ సారథ్యంలోని అధికార కన్జర్వేటివ్ పార్టీ పరాజయం పాలయింది. దీంతో 14 ఏండ్ల ఆ పార్టీ పాలనకు తెరపడింది. ఇంగ్లండ్, స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్‌లతో కూడిన యూకేలో గురువారం పోలింగ్ జరుగ్గా.. శుక్రవారం ఫలితాలు వెల్లడయ్యాయి. 650 మంది సభ్యులు ఉండే హౌస్ ఆఫ్ కామన్స్‌లో లేబర్ పార్టీ 412 స్థానాలను కైవసం చేసుకుంది. కన్జర్వేటివ్ పార్టీ కేవలం 121 స్థానాలకు మాత్రమే పరిమితమైంది. లిబరల్ డెమోక్రాట్లు 71 స్థానాల్లో విజయం సాధించగా, మిగతా పలు పార్టీలు సింగిల్ డిజిట్‌కు పరిమితమయ్యాయి. లేబర్ పార్టీ 33.7 శాతం ఓట్లను సాధించగా.. కన్జర్వేటివ్ పార్టీ 23.7% ఓట్ షేర్ దక్కించుకొన్నది. పార్లమెంట్ ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘన విజయంతో యూకే తదుపరి ప్రధానిగా కీర్ స్టార్మర్ నియమితుల య్యారు. కింగ్ చార్లెస్-3 ఆయన నియామకాన్ని ఆమోదించారు. రాజును కలిసిన అనంతరం యూకే ప్రధాని హోదాలో కీర్ స్టార్మర్ దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. దేశాన్ని పునర్నిర్మిస్తానని, మార్పు కోసం పనిని వెంటనే ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో రిషి సునాక్ అంతకుముందు ప్రధాని అధికారిక నివాసం 10 డౌనింగ్ స్ట్రీట్ వద్ద చివరి ప్రసంగం చేసి, కింగ్ చార్లెస్‌ను కలిసి తన రాజీనామా పత్రం సమర్పించారు. ఎన్నికల్లో ఓటమిని అంగీకరిస్తున్నానని, కన్జర్వేటివ్ పార్టీ ఘోర పరాజయానికి బాధ్యత వహిస్తున్నట్టు పేర్కొన్నారు. రిషి సునాక్ ఉత్తర ఇంగ్లండ్‌లోని ఓన్ రిచ్‌బండ్ అండ్ నార్త్ అల్లర్‌టన్ స్థానం నుంచి 23 వేల ఓట్లతో గెలిచారు.

ఎవరీ స్టార్మర్?

61 ఏండ్ల కీర్ స్టార్మర్ మానవ హక్కుల న్యాయవాది. చాలా కాలం లాయర్‌గా పనిచేసి, రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2015లో లండన్ నుంచి లేబర్ పార్టీ తరపున ఎంపీగా ఎన్నికయ్యారు. 2019 ఎన్నికల్లోనూ విజయం సాధించారు. ఆ మరుసటి ఏడాదే పార్టీ పగ్గాలు అందుకున్నారు. సరికొత్త లేబర్ పార్టీని ఆవిష్కరించారు. జెరెమీ కార్బిన్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కశ్మీర్‌పై ఓ తీర్మానం చేశారు. అంతర్జాతీయ పరిశీలకులు కశ్మీర్‌లో పర్యటించాలని, కశ్మీరీలకే సొంత నిర్ణయాధికారం కల్పించాలని డిమాండ్ చేశారు. అయితే స్టార్మర్ బాధ్యతలు చేపట్టాక కశ్మీర్‌పై పార్టీ విధానంలో మార్పు తీసుకొచ్చారు. కశ్మీర్ భారత్, పాక్‌కు సంబంధించిన విషయని, విదేశీ జోక్యం తగదని పేర్కొన్నారు.

ఈ రోనే పని ప్రారంభిస్తున్నాం: కీర్ స్టార్మర్

నూతన ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం కీర్ స్టార్మర్ జాతినుద్దేశించి మాట్లాడుతూ యూకేను పునర్నిర్మిస్తానని హామీ ఇచ్చారు. 'మా పని అత్యవసరం, దాన్ని ఈరోజే ప్రారంభిస్తున్నాం' అని పేర్కొన్నారు. మార్పు కోసం ప్రజలు ఓటేశారని అన్నారు. తాను మాటలు చెప్పనని, పని చేసి చూపిస్తానని ఈ సందర్భంగా స్టార్మర్ పేర్కొన్నారు.

రిషి సునాక్ భావోద్వేగం

ప్రధానిగా చివరి ప్రసంగం సందర్భంగా రిషి సునాక్ భావోద్వేగానికి గురయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమికి తాను బాధ్యత వహిస్తున్నానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఓటర్లకు ఆయన క్షమాపణలు చెప్పారు. 'ముందుగా మీ అందరికీ క్షమాపణలు చెబుతున్నా. ప్రధానిగా నా బాధ్యతను పూర్తిస్థాయిలో ఏ లోటు లేకుండా నిర్వర్తించానని అనుకొంటున్నా. కానీ, యూకేలో ప్రభుత్వం కచ్చితంగా మారాల్సిందేనని మీరు(ప్రజలు) సంకేతం ఇచ్చారు. మీ ఆగ్రహం, అసంతృప్తి నాకు వినిపించింది' అంటూ రిషి సునాక్ తన భార్య అక్షతా మూర్తిని చూస్తూ భావోద్వేగ ప్రసంగం చేశారు. ప్రధానిగా తన హయాంలో దేశంలో ద్రవ్యోల్బణాన్ని నియంత్రించానని, యూకేను ఒక సురక్షితమైన, బలమైన దేశంగా చేశానని పేర్కొన్నారు.

ఎంపీలుగా 28 మంది భారత సంతతి వ్యక్తులు

యూకే సార్వత్రిక ఎన్నికల్లో రికార్డు స్థాయిలో దాదాపు 28 మంది భారత సంతతి వ్యక్తులు ఎంపీలుగా గెలిచారు. కన్జర్వేటివ్ పార్టీ తరపున తమ సీట్లను తిరిగి నిలబెట్టుకొన్న వాళ్లలో ప్రీతి పటేల్, సుయేల్లా బ్రేవర్మన్, గగన్ మోహింద్రా, శివానీ రాజా తదితరులు ఉన్నారు. లేబర్ పార్టీ నుంచి అధిక సంఖ్యలో భారత సంతతి వ్యక్తులు గెలిచారు. ఈ జాబితాలో సీమా మల్హోత్రా, ప్రీత్ కౌర్ గిల్, తన్మ జీత్ సింగ్ తదితరులు ఉన్నారు. జాస్ అథ్వాల్, బగ్గీ శంకర్, సత్వీర్ కౌర్, కనిష్క నారాయణ్ తదితరులు తొలిసారిగా ఎంపీలుగా ఎన్నికయ్యారు. యూకే ఎన్నికల బరిలో దిగిన ఇద్దరు తెలుగు వ్యక్తులు ఓడిపోయారు. లేబర్ పార్టీ తరపున నార్త్ బెడ్‌ఫోర్డ్ షైర్ నుంచి పోటీచేసిన రచయిత ఉదయ్ నాగరాజు దాదాపు 5 వేల ఓట్లతో ఓటమి పాలయ్యారు. కన్జర్వేటివ్ పార్టీ తరపున స్టోక్ ఆన్ ట్రెంట్ సెంట్రల్ స్థానం నుంచి పోటీ చేసిన మరో తెలుగు వ్యక్తి చంద్ర కన్నెగంటి దాదాపు 6 వేల ఓట్లు మాత్రమే దక్కించుకొని మూడో స్థానానికి పరిమితమయ్యారు.

యూకే తొలి మహిళా ఆర్థిక మంత్రిగా లీవ్స్

యూకే ఆర్థిక మంత్రిగా రాచెల్ రీవ్స్‌ను నూతన ప్రధాని కీర్ స్టార్మర్ నియమించారు. యూకే ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలి మహిళ ఈమెనే కావడం గమనార్హం. రాచెల్ రీవ్స్ ఓ మాజీ చైల్డ్ చెస్ చాంపియన్. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసిన ఆమె.. గతంలో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ ఆర్థికవేత్తగానూ పనిచేశారు. ఆర్థిక మంత్రిగా నియమితులైన నేపథ్యంలో బలమైన ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ దేశ ఆర్థిక వృద్ధికి కృషి చేస్తానని రాచెల్ రీవ్స్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. రాచెల్ రీవ్స్ 2010లో తొలిసారి ఎంపీ అయ్యారు.

స్టీల్, అల్యూమినియం పాత్రలకు

ఐఎస్ఐ గుర్తు తప్పనిసరి

న్యూఢిల్లీ, జూలై 5: స్టెయిన్‌లెస్ స్టీల్, అల్యూమినియం వంట పాత్రలకు కేంద్ర ప్రభుత్వం ఐఎస్ఐ గుర్తును తప్పనిసరి చేసింది. వినియోగదారుల భద్రత, ఉత్పత్తుల నాణ్యతను పెంపొందించే చర్యల్లో భాగంగా జాతీయ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఈ ఆదేశాలు జారీ చేసింది. ఐఎస్ఐ మార్క్ లేని స్టీల్, అల్యూమినియం వంట పాత్రల తయారీ, ఎగుమతి, అమ్మకాలు, పంపిణీ, నిల్వ, ప్రదర్శనపై నిషేధం ఉందని భారత ప్రమాణాల సంస్థ(బీఐఎస్) తెలిపింది. ఈ ఆదేశాలను ధిక్కరించిన వారిపై జరిమానాలు విధిస్తామని చెప్పింది. వంట పాత్రల తయారీకి సంబంధించి బీఐఎస్ తాజాగా కొన్ని ప్రమాణాలు రూపొందించింది. వీటిలో పాత్రల తయారీకి కావాల్సిన ముడి సరుకు, డిజైన్లకు సంబంధించిన అంశాలు ఉన్నాయి.

వంతెనలు కూలడంపై 15 మంది ఇంజినీర్లపై వేటు

పాట్నా, జూలై 5: 2 వారాల వ్యవధిలో 12 వంతెనలు కూలిన ఘటనలకు సంబంధించి బీహార్ ప్రభుత్వం శుక్రవారం 15 మంది ఇంజినీర్లపై సస్పెన్షన్ వేటు వేసింది. వారు వంతెనల నిర్వహణకు సరైన చర్యలు తీసుకోలేదని రాష్ట్ర జల వనరుల శాఖ అదనపు ముఖ్య కార్యదర్శి చైతన్య ప్రసాద్ ఆరోపించారు. ఈ ఘటనల వెనుక కాంట్రాక్టర్ల అశ్రద్ధను ఆయన ఎత్తి చూపారు. మరోవైపు కూలిన బ్రిడ్జిల స్థానంలో కొత్తవాటిని నిర్మించాలని ప్రభుత్వం ఆదేశించింది.

పుణె పోర్షే కారు కేసు.. రోడ్డు భద్రతపై వ్యాసం సమర్పించిన బాలుడు

పుణె, జూలై 5: పుణె పోర్షే కారు కేసులో నిందితుడైన 17 ఏండ్ల బాలుడు జువైనల్ జస్టిస్ బోర్డు (జేజేబీ) బెయిల్ నిబంధనలకు అనుగుణంగా రోడ్డు భద్రతపై 300 పదాల వ్యాసాన్ని సమర్పించినట్టు శుక్రవారం ఒక అధికారి తెలిపారు. కాగా, ఈ కేసులో అతడిని రిమాండ్‌కు పంపడం జువైనల్ చట్టం ప్రకారం అక్రమమని బాంబే హైకోర్టు పేర్కొనడంతో గత నెలలో అబ్జర్వేషన్ హోమ్ నుంచి విడుదల చేశారు. మే 19న పుణెలో ఈ బాలుడు మద్యం మత్తులో అర్ధరాత్రి తన లగ్జరీ పోర్షే కారుతో ఢీకొనడంతో ఇద్దరు యువ టెకీలు మరణించారు. ప్రమాదం జరిగిన కొద్ది గంటలకే అతడిని జేజేబీ విడిచిపెట్టడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి.

ఆగస్టులో మోదీ సర్కార్ కూలొచ్చు!

చాలా బలహీనంగా కేంద్రప్రభుత్వం: లాలూ

పాట్నా, జూలై 5: ఆర్జేడీ అధినేత, బీహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో కొత్తగా కొలువుదీరిన బీజేపీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం చాలా బలహీనంగా ఉన్నదని, వచ్చే నెలలోగా కూలిపోయే అవకాశం ఉందంటూ వ్యాఖ్యానించారు. ఆర్జేడీ పార్టీ 28వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శుక్రవారం పాట్నాలో మాట్లాడారు. మోదీ ప్రభుత్వం చాలా బలహీనంగా ఉన్నదన్నారు. ఆ సర్కార్ ఏ క్షణంలో అయినా కూలిపోవచ్చని, అది ఆగస్టులోనే జరగొచ్చన్నారు. అటువంటి సందర్భం ఎదురైతే తర్వాత జరిగే పరిణామాలకు సిద్ధంగా ఉండాలని పార్టీ నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తమ పార్టీ బీహార్ అసెంబ్లీలో చాలా కాలంగా అతిపెద్ద పార్టీగా ఉన్నదని, ఇతర పార్టీల మాదిరిగా సిద్ధాంతాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని పరోక్షంగా నితీశ్ కుమార్‌ని ఉద్దేశించి లాలూ వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో లాలూ కుమారుడు, బీహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ కూడా పాల్గొన్నారు.

నీట్‌ను రద్దు చేయలేం

> **మొదటిపేజీ తరువాయి...**

నమోదైన కేసులను సీబీఐ దర్యాప్తు చేస్తున్నదని తెలిపాయి. నీట్ యూజీ పరీక్షలో అక్రమాలు జరిగాయని, పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు ఈనెల 8న విచారణ చేపట్టనున్నది.

ఊహాగానాలు, అనుమానాల ఆధారంగా..

ఏండ్ల పాటు కష్టించి, నిజాయితీగా పరీక్ష రాసిన లక్షలాది మంది విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు కట్టుబడి ఉన్నామని కేంద్ర విద్యా శాఖ తన అఫిడవిట్‌లో తెలిపింది. నిరూపితమైన వాస్తవాల ఆధారంగా నిజమైన ఆందోళనను తప్పనిసరిగా పరిష్కరించాలని, ఇదే సమయంలో వాస్తవాలు లేకుండా కేవలం ఊహాగానాలు, అనుమానాల ఆధారంగా చేసే ఇతర అభ్యర్థనలను తిరస్కరించాలని పేర్కొన్నది. నిజాయతీ అభ్యర్థులు, వారి తల్లిదండ్రులకు అనవసరమైన ఇబ్బందులు, వ్యథ కలుగజేయకూడదని అభిప్రాయపడింది. పరీక్ష ప్రక్రియను సమర్థంగా నిర్వహించేలా తీసుకోవాల్సిన తగిన చర్యలు, సంస్కరణలపై సిఫారసు చేసేందుకు ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమించామని కోర్టుకు తెలిపింది.

ఆరోపణలు నిరాధారం: ఎన్టీఏ

మరోవైపు వేరుగా అఫిడవిట్ దాఖలు చేసిన ఎన్టీఏ.. కేంద్ర ప్రభుత్వ వాదననే పునరుద్ఘాటించింది. పరీక్షను రద్దు చేస్తే విద్యార్థుల ప్రయోజనాలకు నష్టమని, క్వాలిఫై అయిన విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని పేర్కొన్నది. నీట్ యూజీ-2024 పరీక్షను ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించామని కోర్టుకు తెలిపింది. పరీక్ష నిర్వహణలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలను ఎన్టీఏ ఈ సందర్భంగా ఖండించింది. ఆ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, తప్పుదోవ పట్టించేవని పేర్కొన్నది.

ఆగస్ట్ 11న నీట్-పీజీ

- రెండు షిఫ్టుల్లో పరీక్ష
- ఎన్‌బీఈఎంఎస్ వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 5: దేశవ్యాప్తంగా పీజీ వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్-పీజీ 2024 పరీక్ష తేదీ ఖరారైంది. ఆగస్టు 11న రెండు షిఫ్టుల్లో పరీక్ష నిర్వహించనున్నట్టు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) శుక్రవారం వెల్లడించింది. నీట్ యూజీ పేపర్ లీక్‌పై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తడంతో గత నెల 23న జరగాల్సిన నీట్ పీజీ పరీక్షను వాయిదా వేస్తున్నట్టు పరీక్షకు ఒక రోజు ముందు కేంద్రం ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా సవరించిన పరీక్ష షెడ్యూల్‌ను ప్రకటించారు. పరీక్షకు హాజరయ్యేందుకు అవసరమైన అర్హతకు సంబంధించిన కటాఫ్ తేదీ ఆగస్టు 15గానే కొనసాగుతుందని బోర్డు వెల్లడించింది.

పంచాయితీ తెంచిన బర్రె!

ప్రతాప్‌గఢ్: తప్పిపోయిన ఓ బర్రె తనదంటే తనది అంటూ ఇద్దరు వ్యక్తులు వాదులాడుకున్నారు. వీరిద్దరిలో ఎవరు అసలు యజమాని అని కనిపెట్టలేక పంచాయితీ పెద్దలు, పోలీసులు చేతులెత్తేశారు. ఇక లాభం లేదనుకొని, బర్రెకే నిర్ణయం వదిలేశారు. ఆ బర్రె అసలు యజమానిని గుర్తించి, అతడి ఇంటికి చేరింది. వివరాల్లోకెళితే.. యూపీలోని ప్రతాప్‌గఢ్ జిల్లా మహేశ్ గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్షరాంపూర్ గ్రామంలో నందలాల్ సరోజ్‌కు చెందిన బర్రె కొన్ని రోజుల క్రితం తప్పిపోయింది. అది పూరే హరికేశ్ గ్రామానికి చేరింది. ఆ ఊరికి చెందిన హనుమాన్ దాన్ని కట్టేశాడు. నందలాల్ ఎంత వెతికినా బర్రె ఆచూకీ దొరకలేదు. చివరికి హనుమాన్ వద్ద ఉన్నదని తెలిసి, అక్కడికి వెళ్లి అడగ్గా.. ఆ బర్రె తనదేనని వాదించాడు. దీంతో నందలాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, పంచాయితీకి పిలిపించాడు. ఆ బర్రె తనదేనని హనుమాన్, నందలాల్ వాదులాడుకున్నారు. ఏం చేయాలో పాలుపోకపోవటంతో స్టేషన్ ఆఫీసర్ ఓ నిర్ణయానికి వచ్చారు. ఆ బర్రెను రెండు ఊళ్ల మధ్య విడిచిపెట్టి, ఆ బర్రె ఏ యజమాని చెంతకు చేరితే వారే అసలైన యజమాని అని స్పష్టం చేశారు. దానికి ఇరు వర్గాలు సమ్మతించాయి. దీంతో ఆ బర్రెను తీసుకొచ్చి రెండు ఊళ్ల మధ్య విడిచిపెట్టగా, అది నేరుగా నందలాల్ ఇంటికి చేరింది. దీంతో హనుమాన్‌ను పోలీసులు, గ్రామస్థులు మందలించారు.

పాము కాటేస్తే కొరికి చంపేశాడు!

పాట్నా: పాము కాటేస్తే.. తిరిగి దాన్ని కొరికి చంపేశాడో వ్యక్తి. ఈ ఘటన బీహార్‌లో చోటుచేసుకుంది. నవాడాలోని రాజౌరీ ప్రాంతానికి చెందిన సంతోష్ లోహర్‌కు పాము కాటేసింది. వెంటనే దాన్ని పట్టిన సంతోష్.. మూడు సార్లు కొరికాడు. దాంతో ఆ పాము అక్కడికక్కడే చనిపోయింది. అలా ఎందుకు చేశావని అతడిని ప్రశ్నిస్తే.. పాము కుడితే, తిరిగి దాన్ని రెండు సార్లు కరిస్తే విషం ప్రభావం ఉండదని తమ గ్రామంలో నమ్ముతామని తెలిపాడు. ఆశ్చర్యకరంగా సంతోష్ ప్రమాదం నుంచి బయటపడగా, పాము ప్రాణాలు విడిచింది. ఈ విషయం తెలిసిన సమీప గ్రామాల ప్రజలు సంతోష్‌ను చూసేందుకు దవాఖానకు పోటెత్తారు.

ఆ వదంతులను నమ్మొద్దు

ఎఫ్ఎంజీఈ అభ్యర్థులకు ఎన్‌బీఈఎంఎస్ హెచ్చరిక

న్యూఢిల్లీ: మోసగాళ్ల నుంచి అప్రమత్తంగా ఉండాలని ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ ఎగ్జామినేషన్ (ఎఫ్ఎంజీఈ) అభ్యర్థులకు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) శుక్రవారం హెచ్చరించింది. సొమ్ము చెల్లిస్తే, ప్రశ్నా పత్రాన్ని ఇస్తామని హామీ ఇస్తూ సామాజిక మాధ్యమాల ద్వారా మోసగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపింది. ఈ పరీక్ష శనివారం జరుగుతుందని, దీనికి సంబంధించిన ప్రశ్నా పత్రం ఇంకా తయారీ దశలోనే ఉందని చెప్పింది. 50 నగరాల్లోని 71 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్ష జరుగుతుంది. మన దేశంలో మెడిసిన్ ప్రాక్టీస్ చేయాలంటే ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించవలసి ఉంటుంది.

స్వలింగ వివాహాల చట్టబద్ధతపై రివ్యూ పిటిషన్ల విచారణ 10న

న్యూఢిల్లీ: స్వలింగ వివాహాలకు చట్టబద్ధ గుర్తింపును తిరస్కరిస్తూ ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కోరుతున్న పిటిషన్లపై సుప్రీంకోర్టు ఈ నెల 10న విచారణ జరుపుతుంది. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం వీటిని పరిశీలిస్తుంది. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించేందుకు తిరస్కరిస్తూ సుప్రీంకోర్టు గత ఏడాది అక్టోబరు 17న తీర్పు చెప్పింది. దీనిపై నిర్ణయాధికారం పార్లమెంటుదేనని పేర్కొన్నది.

వివిధ వ్యక్తుల మూలకణాలతో మినీ బ్రెయిన్

న్యూయార్క్, జూలై 5: వివిధ వ్యక్తుల నుంచి సేకరించిన మూలకణాలను 3డీ మ్యాపింగ్‌తో ప్రాసెసింగ్ చేసి మినీ బ్రెయిన్‌ను అభివృద్ధి చేశారు యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా పరిశోధకులు. దీన్ని 'కేమెరాయిడ్'గా పిలుస్తున్నారు. మనిషి మెదడు ఎలా పనిచేస్తుందో.. ఈ కేమెరాయిడ్ కూడా అలాగే పనిచేస్తుందని పరిశోధకులు అన్నారు. అయితే, భిన్నమైన వ్యక్తుల నుంచి మూలకణాలను తీసుకోవడంతో ఈ మినీ బ్రెయిన్ ఆయా వ్యక్తుల మెదడులా కాకుండా కొత్తగా ఆలోచిస్తుందని పేర్కొన్నారు. మెదడుపై డ్రగ్స్ పనితీరు తెలుసుకోవడానికి దీన్ని వినియోగిస్తామన్నారు.



అంతుచిక్కని కృష్ణ పదార్థం గుండా భూమి!

న్యూఢిల్లీ, జూలై 5: భూమి సూర్యుని చుట్టూ తిరుగుతూ విశ్వాంతరాళంలో ఓ ప్రవాహం మాదిరి ముందుకు కదులుతుందన్న విషయం తెలిసిందే. అయితే, ప్రస్తుతం భూమి ఓ అంతుచిక్కని కృష్ణ పదార్థాన్ని దాటుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. దీంతో భూమి మీదనున్న ఐనో ఆవరణంలో కొత్త రేడియో తరంగాలు ఉద్భవిస్తున్నట్టు పేర్కొన్నారు. వీటిని లోతుగా విశ్లేషిస్తే, విశ్వం పుట్టుక, గమనం గురించి మరిన్ని విషయాలు తెలుసుకోవచ్చని అభిప్రాయపడుతున్నారు. ఈ కృష్ణ పదార్థాన్ని 'డార్క్ ఓషన్'గా వాళ్లు అభివర్ణిస్తున్నారు.

గుండెపోటును పసిగట్టేద్దాం!

- కేవలం ఐదు నిమిషాల్లోనే గుర్తించే టెస్ట్
- ఇంట్లో ఎవరైనా, ఎప్పుడైనా చేసుకోవచ్చు

(స్పెషల్ టాస్క్ బ్యూరో) హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): మారిన జీవనశైలి కారణంగా భారత్‌లో ఏటా గుండెపోటుతో 30 వేల మంది మృత్యువాత పడుతున్నారు. గుండెనొప్పిని ముందస్తుగా గుర్తించకపోవడంతోనే మరణాల రేటు ఎక్కువవుతున్నట్టు వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో గుండెపోటు వచ్చే ముప్పును ఇంట్లోనే ఉంటూ సులభంగా కనిపెట్టే టెస్టును స్వీడిష్ పరిశోధకులు అభివృద్ధి చేశారు. ప్రత్యేక అల్గారిథమ్‌తో పనిచేసే ఈ టెస్ట్ సాయంతో 5-8 నిమిషాల్లోనే గుండె జబ్బులు వచ్చే ముప్పును తెలుసుకోవచ్చని చెబుతున్నారు. ఈ వివరాలు 'జర్నల్ ఆఫ్ ది అమెరికన్ హార్ట్ అసోసియేషన్'లో ప్రచురితమయ్యాయి.

65% కచ్చిత ఫలితాలు



టెస్ట్‌లో భాగంగా వ్యక్తి వయసు, లింగం, బరువు, నడుము చుట్టుకొలత, ధూమపానం అలవాటు, రక్తపోటు, రక్తంలో కొవ్వుల స్థాయి, మధుమేహం, గతంలో కుటుంబసభ్యులకు గుండెజబ్బులు ఉన్నాయా? లేదా? వంటి ప్రశ్నలతో నిండిన ఈ టెస్ట్‌ను తొలుత పూర్తి చేయాల్సి ఉంటుంది. మనం ఇచ్చిన సమాధానాలను ప్రత్యేక అల్గారిథమ్ ట్రెయిన్ చేసి.. గుండెనొప్పి వచ్చే ఛాన్స్‌ను హెచ్చరికలతో సహా సూచిస్తుంది.

గాలి, సూర్యరశ్మితో తాగునీరు ఉత్పత్తి

న్యూయార్క్, జూలై 5: తాగునీటి సంక్షోభం మానవాళిని అందోళనకు గురిచేస్తున్న సమయంలో అమెరికాకు చెందిన ఓ కంపెనీ గుడ్ న్యూస్ చెప్పింది. గాలి, సూర్యరశ్మి నుంచి క్యూబ్ డ్రింకింగ్ వాటర్‌ను తయారు చేయనున్నట్టు ప్రకటించింది. 'స్కై వాటర్'గా పిలిచే ఈ నీటి తయారీకి సూర్యకాంతితో పనిచేసే హైడ్రోప్యానెల్స్‌ను వినియోగించనున్నట్టు వెల్లడించింది. ఒక్కో ప్యానెల్ రోజుకు మూడు లీటర్ల స్వచ్ఛమైన తాగునీటిని ఉత్పత్తి చేస్తుందని వివరించింది. త్వరలోనే ఈ నీటిని మార్కెట్లోకి విడుదల చేయనున్నట్టు తెలిపింది.

ప్రపంచంలోనే తొలి లేజర్ యాంజియోప్లాస్టీ

రాయ్‌పూర్, జూలై 5: కిడ్నీ, గుండె నాళాల్లో అడ్డంకులను లేజర్ యాంజియోప్లాస్టీతో ఏకకాలంలో తొలగించి ఛత్తీస్‌గఢ్ రాయ్‌పూర్‌లోని డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ దవాఖాన వైద్యులు రికార్డు సృష్టించారు. ప్రపంచంలో ఈ తరహా చికిత్స ఇదే మొదటిదని వెల్లడించారు. 66 ఏండ్ల రోగి గుండె ధమని 90 శాతం పూడుకుపోయిందని, ఎడమ మూత్రపిండంలోని నాళం 100 శాతం మూసుకుపోయిందని డాక్టర్ స్మిత్ శ్రీవాస్తవ తెలిపారు. లేజర్ సాయంతో నాళాల్లో బెలూన్‌ను చొప్పించి శస్త్రచికిత్స పూర్తిచేశామన్నారు. రోగి ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నట్టు వెల్లడించారు.

అంగారకుడిపై ఉల్కల దాడి

న్యూఢిల్లీ, జూలై 5: సౌరకుటుంబంలో జీవం ఆనవాళ్లు ఉండొచ్చని భావిస్తున్న అంగారక గ్రహానికి ఉల్కల బెడద ఎక్కువైనట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. ప్రతీ రోజూ ఆ గ్రహం మీద ఉల్కాపాతం జరుగ